www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 28 జులై 2025

5

కాకినాడ

ఉత్తమ విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అడబాల ట్రస్టు కార్యాలయంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ తన తల్లిదండ్రులను స్మరించుకుంటూ ఉత్తమ విద్యార్థికి లేప్‌టాప్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి. కృష్ణమోహన్ మాట్లాడుతూ మనిషికి ఉండాల్సిన గొప్పగుణం దానగుణమని అన్నారు. ఉత్తమ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిగా లాప్ టాప్ అందిస్తున్న శ్రీనివాస్ అభినందనీయులన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు విద్యను ప్రోత్సహించే దిశగా లాపటాప్‌ను అందించిన శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో కెఎస్.శర్మ, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, బుద్దరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకేదీ భరోసా.?

- ఆర్‌ఎస్‌కెల్లో మందులు కరువు
- నిలిచిపోయిన దాణా పంపిణీ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పశు సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందించాలనే లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌బికెలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. ఈ కేంద్రాలు గత పాలన నుంచి ప్రస్తుత ప్రభుత్వ పాలనలోనూ అరకొర సేవలకే పరిమితమయ్యాయి. గత నాలుగేళ్లుగా మందులు అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ప్రయివేట్ దుకాణాల్లో కొనుగోలు చేసుకుంటున్నారు. పశువులకు పూర్తిస్థాయిలో టీకాలు వేయడం లేదు.

జిల్లాలో 408 ఆర్‌ఎస్‌కెల పరిధిలో 76,502 ఆవులు, 2,82,273 గేదెలు, 1,01,870 గొర్రెలు, 1,41,229 మేకలు ఉన్నాయి. కాగా ప్రతి ఆర్‌ఎస్‌కె లోను 108 రకాల మందులు అందుబాటులో ఉండాలి. గత ప్రభుత్వంలో ఆర్‌బికెలు ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలో రూ.5 వేలు నుంచి రూ.10 వేలు విలువ చేసే మందులను అన్నిచోట్లా అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఏ ఆర్‌ఎస్‌కెల్లో చూసినా 10 రకాల మందులు కూడా అందుబాటులో ఉండడం లేదు. జిల్లాలోని పిఠాపురం మండలం ఎఫ్‌.కె.పాలెం, కుమారపురం, గొల్లప్రోలు మండలం చేబ్రోలు తదితర రైతు సేవా కేంద్రాలను పరిశీలిస్తే 108 రకాలకు గాను ఒకటి రెండు రకాలు మినహా మిగిలిన మందులేవీ అందుబాటులో లేవు. అలాగే పశువులకు వేసే టీకాలు మాత్రం పలుచోట్ల అన్ని రకాలు అందుబాటులో ఉంటుండగా, కొన్నిచోట్ల కొన్ని రకాల టీకాలు మాత్రమే ఉంటున్నాయి. నాలుగేళ్లుగా మందుల సరఫరా నిలిచిపోయిందని వైద్య సిబ్బంది చెప్పకనే చెబుతున్నారు. మందులు అవసరమైన వారికి మండల కార్యాలయాల్లో ఉన్న పశు వైద్యశాలలకు పంపిస్తున్నామని వెటర్నరీ అసిస్టెంట్లు చెబుతున్నారు. పాడి రైతులకు ఉపయోగ పడే మందులు లేకపోవడంతో ప్రయివేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందులు లేవంటున్నారు

ఆర్‌ఎస్‌కెల్లో పశు వైద్య సేవలకు సంబంధించిన మందులు అందుబాటులో ఉండడం లేదు. సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలుపుతున్నారు. ప్రయివేటు దుకాణాల్లో రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. అలాగే దాణా కూడా పంపిణీ చేయడం లేదు. ప్రభుత్వ స్పందించి పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి.

ఎ.లచ్చబాబు, పాడి రైతు, బలరామపురం, రౌతులపూడి మండలం

పశు సంరక్షణ గాలికి

పశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం జిల్లాలో ఉన్న ప్రతి రైతు సేవా కేంద్రంలోనూ అన్ని నెలల్లోనూ పశువులకు వివిధ రకాల వైద్య సేవలను అందించడంలో భాగంగా టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా పశు సంరక్షణ గాలికి వదిలేసిందనే విమర్శలు పాడి రైతుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా జూన్ నెలలో గేదెలు, ఆవుల్లో గొంతువాపు, జబ్బు వాపు వ్యాధులకు మొదటి విడతగా టీకాలు వేయాలి. జూలైలో కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నివారణకు, గొర్రెలు, మేకల్లో నీలి నాలుక వ్యాధి నివారణకు టీకాలు వేయాల్సి ఉంది. ఆగస్టులో సంకరజాతి ఆవుల్లో థైలీరియా వ్యాధి నివారణకు, ఆవులు, గేదెల్లో గాలికుంటు నివారణ మొదటి విడత టీకాలు వేయాలి. అలాగే తరచూ వచ్చే జ్వరం, అజీర్తం, విరేచనాలు, దగ్గు, కాళ్ళ నొప్పులు తదితర రోగాలకు ఇక్కడ వైద్య సేవలు అందించాలి. దూడలకు గొంతువాపు వ్యాధి టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్, పందులకు స్వైన్ ఫ్లూ టీకాలు, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందులు ఇవ్వాలి. కృత్రిమ గర్భధారణకు ఎద సూదులు, చూలు కట్టకుంటే పరీక్షించడం వంటి సేవలు అందించాలి. టీకాలు వరకూ వేస్తున్నా మిగిలిన సేవలేవీ పూర్తిస్థాయిలో అందడం లేదు. కొన్ని చోట్ల దమ్ము టీకాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. పశువుల్లో డయేరియా వస్తే డైవర్ట్ మాత్రలు, పొట్టలో పాములు పట్టకుండా డి వార్మ్ మాత్రలు, పాలు సక్రమంగా ఇచ్చేందుకు లెఫ్ట్ డీన్ మాత్రలు, గాయాలు, పుండ్లు మానేందుకు పొటాషియం పరమాంగనేట్ లిక్విడ్, కడుపునొప్పి కోసం సిప్రొవెట్, పాలు లేసేట పుడు గడ్డలు కడితే సన్న కట్టు శుభ్రపరచడానికి జంటా మెసిన్, ఆహారం అరుగుదలకు ఎ‌ట్రాఫిన్, కాళ్ల వాపులకు సోడియం సిలికేట్ మందులు వాడాల్సి ఉంది. కానీ ఇవేమీ అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ప్రయివేటు దుకాణాల్లో రూ.వేలు ఖర్చు పెట్టి కొనుక్కో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వర్షాకాలం సీజన్లో ఎక్కువగా వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పాడి రైతులు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేసుకోవడానికి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరం, పారుడు వ్యాధి, మేత మేయకపోవడం, నులి పురుగులు, గర్భధారణ సమస్యలు తరచూ వస్తున్నాయి. వీటి కోసం నెలలో రూ.1000 నుంచి రూ.2 వేలు వరకూ ఖర్చు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్

విద్యుత్ ఛార్జీల భారాలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన వామపక్ష పార్టీల జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, నగర సహాయ కార్యదర్శి ఎ.భవాని, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఏగుపాటి అర్జునరావు, గొడుగు సత్యనారాయణ, ఎఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఎపిఆర్‌సిఎస్ నాయకులు వి.రాజు బాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జీ, ఎం.రాజ శేఖర్, పలివెల వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ ఆత్యవసరం కాబట్టి, ప్రయివేటు కంపెనీలకు లాభాలు చేకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకొచ్చిందన్నారు. అదాని ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించాలని రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి చేస్తుందన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తెలుసన్నారు. అదే స్ఫూర్తితో వామపక్షాల పోరాటానికి సిద్ధం అవుతున్నాయన్నారు. ప్రజలంతా ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతున్నామన్నారు. ఆగస్టు 5న ప్రజా చైతన్య ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. అలాగే ఇంద్రపాలెం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం మార్కెట్ వద్ద మైక్ ప్రచారం, కరపత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సిహెచ్.విజయకుమార్, చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడారు. ఆగస్టు 5వ తేదీన సబ్‌స్టేషన్ల వద్ద జరుగుతున్న ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రామకృష్ణ, సిహెచ్.మంజూ, గుండుబోగుల శ్రీను, వాసంశెట్టి చంద్రరావు, ఎ.శివ, రాజేంద్రప్రసాద్, పద్మ, కె.ధనలక్ష్మి, ఎం.అమ్మాజీ, ఎస్.సత్య, అంకం సుబ్రహ్మణ్యం, వంతాడి రాంబాబు పాల్గొన్నారు.

ఇంద్రపాలెంలో ప్రచారం చేస్తున్న సిపిఎం శ్రేణులు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు తెలిపారు. వర్షాకాలంలో తడిగా, చిత్తడిగా ఉండే ప్రాంతాలు, నీరు నిలువ ఉండే ప్రాంతాలు అధికంగా ఉంటాయని, దీనివల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వర్షాకాలంలో కరెంట్ స్తంబాలకు, నేలకొరిగిన ఎలక్ట్రికల్ వైర్లకు దూరంగా ఉండాలని, వర్షం పడుతున్నప్పుడు చెట్లకింద నిలబడి ఫోన్లో మాట్లాడటం వంటివి చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఎల్.దివాకర్‌రావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల నమోదు, వాటి యొక్క స్థితిని తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

పెద్దాపురంపై తప్పుడు ప్రచారం : ఎంఎల్‌ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణం గురించి తప్పుగా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు కోరారు. ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దాపురం పట్టణం గురించి తప్పుగా వీడియో విడుదల చేసిన యూట్యూబర్ తులసి చందుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సిఐ విజయశంకర్, ఎస్ఐ వి.మౌనికకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, కెవి.చలం, ఒబిలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న చినరాజప్ప

తొలుత మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ ఆధ్వర్యాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దాపురం పట్టణంపై చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, పట్టణం పురాతన వైభవాన్ని బురదజల్లే విధంగా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) నగర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక పిఆర్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన ఎస్ఎఫ్ఐ కాకినాడ నగర కమిటీ ఎన్నికయింది. ఎస్ఎఫ్ఐ నగర ప్లీనరీ సమావేశం జరిగింది. నగర అధ్యక్షులు సంజయ్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం. గంగాసూరిబాబు, అధ్యాపకులు వర్మ భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. నేటి విద్యార్థులు ఎస్ఎఫ్ఐ వంటి సంఘాలలో చురుగ్గా పాల్గొనాలని, భయాన్ని వదిలి ధైర్యంగా ప్రశ్నించాలని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని, ఎన్ఇపి 2020ని తక్షణమే రద్దు చేయాలని, ఎయిడెడ్ పాఠశాల కళాశాలలో పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నగర నూతన అధ్యక్ష కార్యదర్శులుగా వాసుదేవ్, సాహిత్ ఎన్నికయ్యారు. నగర ఉపాధ్యక్షులుగా అమృత, రాజేష్, గమనవేలు, కరుణ్, సహాయ కార్యదర్శులుగా సత్యం, తేజ, అక్షిత, భువనేశ్వరి ఎన్నికయ్యారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ కార్యవర్గం

బాధితునికి రూ.20 వేల సాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడకు చెందిన రాసపల్లి శ్రీను లివర్ వ్యాధి సమస్యతో బాధపడుతున్నాడు. బాధితునికి ఆదివారం భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ రూ.20 వేలను సాయం అందించింది. శ్రీను వైద్యానికి సుమారు రూ.3 లక్షల వరకు అవసరం అవుతుందని, 3 నెలల వరకు మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ రూ.20 వేలతోపాటు, 25 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు శేషారెడ్డి, అధ్యక్షుడు జిఎస్ఎన్, సభ్యులు నాగబాబు, సుబ్బారావు, జగన్, అఖిలేష్, నాని, ఏసుబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

యాకోబ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

సిబిసిఎన్‌సిలో నకిలీ నియామకాలపై హైకోర్ట్ స్టే ఇచ్చిందని, నియామకాల్లో కోట్లు దండుకున్న యాకోబ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిబిసిఎన్‌సి పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు మాసా ఆగస్టిన్ మెషాక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిబిసిఎన్‌సిలో జరిగిన అక్రమాలపై తాను హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. దీంతో న్యాయస్థానం అక్రమ నియామకాలు వెంటనే నిలుపుదల చేయాలని స్టే ఆర్డర్ ఇచ్చిందని వివరించారు. ఉద్యోగ నియామకాలు చేపడతామని కోట్ల రూపాయల దండుకుని, నిరుద్యోగులను మోసం చేసిన దాసరి యాకోబ్, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బోర్డ్ అఫ్ ఎడ్యుకేషన్ ప్రకారం దాసరి యాకోబ్ విద్యా కన్వీనర్‌గా అనర్హుడుని, ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. కలెక్టర్, డిఇఒ, విద్యాశాఖ కమిషనర్‌కి ఈ అంశంపై ఫిర్యాదు చేసినట్లు తలెఇపారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 36 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. అనంతరం 12 గంటలకు 6 అంశాల ఎజెండాపై కాంట్రాక్ట్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తంటికొండ దేవస్థాన కమిటీ నియామకం

ప్రజాశక్తి - జగ్గంపేట

గోకవరం మండలంలోని తంటికొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ నూతన కమిటీని నియమించారు. నూతన కమిటీ ఛైర్మన్‌గా బద్దిరెడ్డి అచ్చన్నదొర, సభ్యులుగా సుంకర వీరమణి, వేగి దుర్గాదేవి, నాగులపాటి అరుణకుమారి, చింతల నాగేశ్వరరావు, బొట్టా రామకృష్ణ, పసుమర్తి సత్యకళ, సప్పిడి పెంటరాజు, మల్ల అమ్మాజీ, వల్లూరి ప్రసాద్, మడకం పద్మ నియమితులయ్యారు. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా దేవస్థాన పురోహితులు పెద్దింటి దత్త నియమించారు. నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నెహ్రూ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో దేవస్థాన ప్రతిష్ట మసకబారిందని, సమిష్టి కృషితో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక లింగంపర్తి రోడ్డులో ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ బనానా ల్యాండ్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ డిఎస్ఎన్.రమేష్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా అనసూరి నాగేశ్వరరావు, గొల్లపూడి గణేష్‌లతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రమేష్‌రాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా 144 దేశాల్లో సేవలు అందిస్తుందన్నారు. భూకంపాలు, తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు లయన్స్ క్లబ్ సేవలు అందిస్తుందన్నారు. ఏలేశ్వరం క్లబ్ అధ్యక్షునిగా నాగేశ్వరరావు లయన్స్ క్లబ్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. క్లబ్ నూతన అధ్యక్షుడు అనుసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడోసారి అధ్యక్షుడిగా నన్ను ఎన్నుకున్నందుకు క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 2025-26 సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి క్లబ్ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అలమండ దుర్గాప్రసాద్, సభ్యులు జె.శ్రీనివాస్, వి.రాజబాబు, కె.నాగభూషణం, టి.గొల్లాజీరావు, కోట శ్రీనివాస చక్రవర్తి, వి.అప్పన్నబాబు, వి. నాని, సూర్య, గోపి పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు ఎంఎల్‌ఎ సత్యప్రభ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యురాలిగా నియమించిన సిఎం చంద్రబాబుకు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం, వారి హక్కులు, సంరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యురాలుగా ఎంపికైన సత్యప్రభకు పలువురు అభినందనలు తెలిపారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జూదాలు ఆడుతున్న పలు ప్రదేశాల్లో ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. స్థానిక టౌన్ హాలును, బాలాజీ నగర్‌లోని అనుమానిత ప్రాంతాన్ని, కాకినాడ రోడ్డులోని ఎస్ఆర్ బంక్ వెనుక స్థలాన్ని, మండలంలోని రాజపూడి రైస్ మిల్లు వెనుక పామాయిల్ తోటలోని భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘునాథరావు మాట్లాడుతూ జూద క్రీడలు నిర్వహించే ప్రాంతాల్లో తనిఖీలు చేయడం జరిగిందన్నారు.

ఘనంగా గోవమ్మ తల్లి తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ పంచాయతీ బాబానగర్‌లోని గోవమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. రాయప్రోలు కామేశ్వర శర్మ, పుల్లేటికుర్తి సూర్యరమేష్ శివాచార్య దంపతులచే పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సంగాడి కామేశ్వరరావు, చింతా లక్ష్మణస్వామి, గాడిమొగ మాజీ సర్పంచ్ కావూరి సూర్యకాంతం పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



బాధ్యతలు స్వీకరించిన త్రీమెన్ కమిటీ

జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రీమెన్ కమిటీల ప్రమాణస్వీకారం కార్యక్రమాలు జరిగాయి. జగ్గంపేట, సామర్లకోట మండలాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎలు, డిసిసిబి ఛైర్మన్ పాల్గొని అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట జగ్గంపేట విశాల సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. స్థానిక కాపు సామాజిక భవనంలో జరిగిన ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. సొసైటీ ఛైర్మన్ బుర్రి సత్యనారాయణ, సభ్యులు నండ్ల చిరంజీవి, పాలిశెట్టి సతీష్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారిని శాలువాలు, పూలమాలతో నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సొసైటీలకు రైతులు కట్టాల్సిన రుణా లను విడతలు వారిగా కట్టించుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడపా భరత్‌కుమార్, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, జనసేన నాయకులు బోధిరెడ్డి శ్రీనివాస్, ఉలిసే ఐరాజు, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా సూతి బూరయ్య, డైరెక్టర్లుగా కొప్పిశెట్టి సూరిబాబు, వైబోగుల సుబ్బారావు యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సిఇఒ జ్యోతుల శ్రీనివాస్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బూరయ్య మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓలుపల్లి శ్రీకాంత్, చందువోలు రాజా, సూతి వీరప్రభాకర్, పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ, ముత్యాలు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని జి.మేడపాడు పిఎసిఎస్ ఛైర్మన్‌గా పాలకుర్తి రవిబాబు, డైరెక్టర్లుగా పాలచర్ల వీర్రాజు, జానా వెంకటరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించాలని అన్నారు. సొసైటీని లాభాల్లోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శీనుబాబు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కంచుమూర్తి రాజన్న, నాయకులు తోటకూర శ్రీను, గుమ్మళ్ల రామకష్ణ, సామర్లకోట పిఎసిఎస్ అధ్యక్షులు పైన్నీ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి పాల్గొన్నారు.

జగ్గంపేటలో బాధ్యతలు స్వీకరిస్తున్న త్రీ మ్యాన్ కమిటీ

ఏలేశ్వరంలో బాధ్యతలు స్వీకరిస్తున్న త్రీ మ్యాన్ కమిటీ

సామర్లకోటలో ప్రమాణస్వీకారం చేస్తున్న త్రీ మ్యాన్ కమిటీ

నేరాలు ఘోరాలు

వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఒక వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు ఇవి.. ఈనెల 22న రాత్రి 11:45 గంటల సమయంలో జగన్నాయకులపాలెం గ్రామం శివారున సాయి వెంకట్ ఫర్నేచర్ షాప్ ఎదురుగా మెయిన్ రోడ్డు వద్ద రామచంద్రాపురం నుంచి ద్రాక్షరామం వైపు గుర్తు తెలియని కారు వెళ్లింది. ఆ సమయంలోకారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌పై వెళుతున్న వనుము కష్ణని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ.లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. ప్రమాదంలో జరిగిన ప్రదేశంల పడి వున్న కారు ఎడమ వైపు సైడ్ మిర్రర్ ఆధారంగా, కెమెరాలను పరిశీలించారు. దీని అధారంగా 26న మండపేటలోని దుర్గా మల్లేశ్వరి మెకానిక్ షాప్ షెడ్‌లో కారుని గుర్తించి సీజ్ చేశారు. ఆదివారం సాయంత్రం అందిన సమాచారం ప్రకారం ఈ కేసులో కారు డ్రైవరు రామచంద్రపురానికి చెందిన దామిశెట్టి వెంకట వీర వర్షిత్,ను జగన్నాయకులపాలెం గ్రామ పెట్రోల్ బంక్ దాటిన తరువాత గున్నాయితూము వద్ద అరెస్ట చేసినట్లు ద్రాక్షారామం ఎస్ఐ వివరించారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆలమూరు మండల కేంద్రంలోని సంత మార్కెట్ వద్ద పేకాడుతున్న సమాచారంతో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అయిదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.13,310 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లి గ్రామ శివారు గరువు చెరువు ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడిలో రూ.5,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈదాడిలో ఎస్ఐ రాఘునాధరావు, సిబ్బంది పాల్గొన్నారని, వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా జగ్గంపేట శివారు స్మశాన వాటిక వద్ద మైనర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 8 లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

కరప మండలంలోని వేములవాడ గ్రామ శివారులో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ టి.సునీత తెలిపారు. వారి నుంచి రూ.3240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

సీతానగరం కాటవరం శివారులో పేకాడుతున్న పేకాడుతున్న ముగ్గురిని సీతానగరం పోలీసులు అరెస్టు చేశారు. కాటవరం గ్రామానికి చెందిన ఒకరు, రాజమండ్రికి చెందిన ఒకరు, కొంతమూరుకు చెందిన ఒకరు మద్యం సేవిస్తూ పేకాడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3 వేల నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరపరుస్తామని సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన గుడివాడ లోవకుమారి ఇంటిలోని బంగారు ఆభరణాలు, నగదు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి లోవకుమారి నిద్రించుచున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోనికి ప్రవేశించి బీరువాలోని విలువైన బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారని, తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్ర నుంచి లేసేసరకి బీరువా తెరిచి ఉండడం చూడగా బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురియిందని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దాపురంలో చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటకు చెందిన బొడ్డు రమణకుమారి శనివారం రాత్రి నువ్వుల గుంట వీధి మీదుగా తన ఇంటికి వెళుతుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్ పై వచ్చి ఆమె మెడలో మూడు కాసుల బంగారు గొలుసు బలవంతంగా లాక్కుని వెళ్లిపోయారు. ఈ సంఘటన జరిగిన సమయంలో వీధిలైట్లు వెలగడం లేదని తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. దీనిపై ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరిపై పోలీసులు ఇద్దరిపై కేసు నమోదుచేశారు. బొబ్బర్లంక సెంటర్ వద్ద ఎస్ఐ ఎస్.రాము ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అధికంగా మద్యం తాగి వాహనం నడుపుతున్నారు. వారిపై అనుమానం రావడంతో వారికి బ్రీత్ ఎనలైజర్ పరికరంతో పరీక్షించారు. వారిద్దరూ అధికంగా మద్యం తాగినట్లు తేలడంతో వారిద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెండి, బంగారం చోరీపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మూడు కిలోల వెండి, ఒక కాసు బంగారం దొంగలించిన సంఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆదివారం వారు తెలిపిన వివరాలు ఇవి.. ఒడలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన పెన్మత్స వెంకట కృష్ణంరాజు ఇటీవల కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తలుపులు తెరచి ఉండడంతో అందులో ఉన్న మూడు కేజీల వెండి, కాసు బంగారం లేకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించి ఉంటారని భావించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అమలాపురం నుంచి క్లూ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించారు. దీనిపై బాధితుడు కష్ణంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. తాజాగా వర్షాలు కురిసిన నేపథ్యంలో కోరుకొండ, గోకవరం మండలాల్లోనూ ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. ఈ దశలో నీటి వనరులు, ఎరువుల లభ్యత తదితర విషయాలపై రైతుల్లో కలవరం మొదలైంది. మరోవైపు సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహం పేరుతో ఎరువుల కేటాయింపు కుదించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో యూరియా కొరత నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సాగు సంబంధింత విషయాలు, ఎరువుల లభ్యతపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'ప్రజాశక్తి' వ్యవశాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావును పలకరించింది. ఈ సందర్భంగా వెల్లడించిన ఆయన మాటల్లోనే...

జిల్లాలో నాట్లు ఎన్ని ఎకరాల్లో ప్రారంభం అయ్యాయి. ఖరీఫ్ సాగు ఎంత విస్తీర్ణంలో జరుగుతుందని అంచనా వేస్తున్నారు..?

జిల్లాలో ఖరీఫ్ సాగు 1.85 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. దాదాపుగా అన్ని మండలాల్లో సాగు ప్రారంభమైంది. 1.47 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. కొన్ని మండలాల్లో ఖరీఫ్ పంట ఆలస్యంగా కోతలు పూర్తయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సాగు కొంత ఆలస్యంగా ప్రారంభించారు. ఈ నెలాఖరునాటికి 90 శాతం నాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభం నేపథ్యంలో రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉంచాము.

జిల్లాలో యూరియా కొరత ఉందని అంటున్నారు.. నిజమేనా..? అన్ని రకాల రసాయన ఎరువుల డిమాండ్ ఎంత ఉంది..? లభ్యత ఎంత ఉంది..?

యూరియా కొరత లేదు. రబీ సాగుకు సంబంధించి రెండు నెలల ముందుగానే కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశాము. రైతులకు కావల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాము. మొత్తం రబీ సాగుకు దశల వారీగా సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుంది. తొలి దశ అవసరాలకు తగ్గట్లుగా ఎరువులను అందుబాటులో ఉంచాము. యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు, ఎంఒపి ఉన్నాయి.

ముందస్తు వ్యవసాయ సాగు ప్రణాళికల ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం లభించింది..?

రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతేడాది ఖరీఫ్‌లో ముందస్తు వ్యవసాయ ప్రణాళికలను రూపొందించాము. మంచి ఫలితాలు వచ్చాయి. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే పరిస్థితుల నుంచి కొంత ఊరట లభించింది. తాజా సాగు కూడా నెల రోజులు ముందుగానే ప్రారంభమైంది. మెట్ట ప్రాంతాలో సాగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాము.

మెట్ట ప్రాంతంలో సాగును ప్రోత్సహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

జిల్లాలో 15,265 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటిలో 8,455 బోర్ల ద్వారా ఉద్యాన పంటలకు సాగు నీరు అందిస్తుండగా మిగిలిన 6,810 బోర్లు మెట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేట, బిక్కవోలు తదితర మండలాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతంలో 1.40 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాము. వీటిలో గొట్టపు బావుల సాయంతో 50 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. రబీలో ఎక్కువగా ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి వంగడాన్ని సాగు చేస్తున్నారు. దీనికి తెగుళ్ల బెడద తక్కువ, మంచి దిగుబడి ఇస్తుంది. ఈ పంట తర్వాత మూడో పంటగా అపరాలు, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట సాగు చేయటానికి ఈ ముందస్తు సాగు ఉపయోగగపడుతుంది.

ప్రతి ఏటా సాగుకు చివరి దశలో నీటి కొరత తలెత్తుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు నీటి పారుదల శాఖతో ఎలా సమన్వయం చేసుకోనున్నారు..?

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన వ్యవసాయ శాఖతో పాటు ఇతర సాగు సంబంధిత శాఖలతో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి నీటి పంపిణీపై చర్చించారు. ఈ ఏడాది సాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 71 వేల ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి సెంటుకూ నీరు అందించే లక్ష్యంతో క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజిన్ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి పెడుతున్నారు. కావున సాగునీటి కొరత ఇబ్బందులుండవు.

యానాంలో కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ యశ్వంతయ్య ఆదివారం యానాంలో పర్యటించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. అనంతరం కో-ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బందికి సంబంధించిన పెండింగ్ జీతాలు, నూతనంగా లిక్కర్ షాపులు ఏర్పాటు, కోఆపరేటివ్ స్టోర్స్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పరదేశమ్మకు గరగ బహూకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామ దేవత పరదేశమ్మతల్లికి స్థానిక కొండిశెట్టి ఈశ్వరరావు, పార్వతీ దంపతులు ఆదివారం గరగను బహుకరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు గృహం నుంచి తాళ్ళరేవు మెయిన్ రోడ్డు, మార్కెట్ మీదుగా ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పులు, మేళతాళాలతో నిర్వహించిన, గరగ నృత్యాలు అలరించాయి. అనంతరం ఈశ్వరరావు ఇంటి వద్ద అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు కుటుంబ సభ్యులు మహేంద్రనాయుడు, సూర్య లక్ష్మీ ప్రసన్న, స్థానిక నాయకులు బండారు శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తపేట

వాడపాలెం ఏటుగట్టు వద్ద ఉన్న పశువుల పాకలో ఆదివారం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వాడపాలెం బండారు పేటకు చెందిన పంతాడి చిన్న (21) ఆదివారం ఎవరూ లేని సమయంలో పశువుల పాకలోని ఉరేసుకున్నాడు. పశువుల పాకయజమాని చూసి స్థానికులు తెలియపరచడంతో తండ్రి తాతారావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ జి.సురేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రులు తరలించారు. పోస్ట్‌మాస్టర్ మృతదేహాన్ని అనంతరం బంధువులకు అప్పగించారు. దీనిపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

భార్యను చంపిన భర్త

ప్రజాశక్తి - రాజానగరం

భార్యను కిరాతకంగా రాయితో భర్త కొట్టి చంపిన సంఘటన రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమూరులో చోటు చేసకుంది. సిఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపిన వివరాలు. నర్సీపట్నం మండలం గిడుగుటూరు చెందిన వేమగిరి మాణిక్యానికి కొంతమూరుకు చెందిన ఉష(27)తో పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి కుమారుడు కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ తరుచూ గొడవ పడడంతో ఉష పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామంలో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చి వెళుతూ ఉండేది. సోమవారం రాత్రి ఉషతో మాణిక్యం గొడవ పడ్డాడు. ఇది చూసి భయపడిన పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లి చెప్పారు. వారు వచ్చేసరికి బలమైన రాయితో ఉష తల, ముఖంపై మాణిక్యం కొట్టడంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయింది. మతురాలు తల్లి నల్లమటి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం కాలువలో యువకుని మృతి

ప్రజాశక్తి - సీతానగరం

పోలవరం కాలువలోకి చేపలు పట్టుకోవడానికి వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దీపక్ సింగ్, పోలవరం ఎడమ కాలువ పనులు చేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 24న మధ్యాహ్నం పోలవరం ఎడమ కాలువలో చేపలు వేటకు వెళ్లి దురదష్టవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆదివారం ఉదయం పోలవరం కాలువలో మతదేహం వెలుగు చూడడంతో పోలీసులకు కాంట్రాక్టర్ సమాచారం అందించారు. జితేష్ కుమార్ సింగ్ ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుని అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

యువకుడు అదశ్యమైన సంఘటన సీతానగరంలో చోటు చేసుకుంది. వంగలపూడి గ్రామానికి చెందిన పల్లప్రోలు వెంకట దుర్గాప్రసాద్ డిగ్రీ చదువుకున్నాడు. ఉదయం చినకొండేపూడిలోని డిగ్రీ కళాశాలకు సర్టిఫికెట్ల నిమిత్తం అని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడు చిన్నాన్న పల్లప్రోలు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజానగరం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు కొంతమూరులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నారాయణమ్మ తెలిపిన వివరాలివి. గ్రామంలోని మెటల్ ఇండస్ట్రీస్‌లో దివాకర్ కుమార్ (21) రెండు నెలలు నుంచి పని చేస్తున్నాడు. సహోద్యోగి ఆదివారం ఉదయం ఇండస్ట్రీ తెలుపు తీయగా షెడ్ పైకప్పుకు దివాకర్ ఉరేసుకుని ఉన్నాడు. ఇండస్ట్రీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తీపర్రులో గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రులో ర్యాలి లక్ష్మణరావు పొలం వద్ద సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు ఇతను పురుగుల మందు తాగి చనిపోయినట్టు తెలుస్తోంది. మృతుడు తెలుపు రంగు బనియన్, నీలం రంగు గళ్ల లుంగీ కట్టుకున్నాడు. సుమారు 5.2 అడుగుల ఎత్తు ఉన్నాడు. మృతదేహాన్ని తణుకు ఏరియా ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుని మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరు రోడ్డు సంత మార్కెట్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. వృద్ధుని వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ మృతదేహానికి సంబంధించి వివరాలు తెలిసినవారు 9440904846, 9440904844 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

లారీ, జీపు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - పెరవలి

ఎస్ఆర్‌కె రైస్ మిల్ సమీపంలో జాతీయ రహదారిపై రావులపాలెం నుంచి తణుకు వెళ్తున్న లారీ వెనుక వైపు వెళుతున్న జీపు ఢీకొట్టడంతో జీపులో ఉన్న కొమ్మోజు విశ్వేశ్వరరావు (58) అక్కడే మృతి చెందారు. జీపులో ముగ్గురు ఉన్నారు. వీరి స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామం. విశ్వేశ్వరావు మృతదేహాన్ని తణుకు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

కూటమి పాలనలో అభివృద్ధి వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సంధిపూడి లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆదివారం ఆయన కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలోని ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - సామర్లకోట

సంక్షేమం, అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం మండలంలోని అచ్చంపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నారని, ప్రతిపక్షం చెప్పే కల్లబొల్లి కబుర్లు నమ్మవద్దని సూచించారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూడలేక ప్రతిపక్షాలు లేనిపోని ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు తోటకూర శ్రీనివాస్, గుమ్మల్ల రామకృష్ణ, ముసిరెడ్డి శ్రీరాములు, చీకట్ల వెంకటేష్, ఆకునూరి సత్తిబాబు, అడ్డాల వెంకన్నబాబు, ఉండూరు సొసైటీ అధ్యక్షులు బచ్చల జమ్మి పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి

ప్రజాశక్తి - కాజులూరు

నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని జనసేన మండల ఇన్‌ఛార్జ్ అన్యం శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. సత్యం ఫౌండేషన్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సొంత నిధులతో అనేకమందిని ఆదుకున్నారని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కుయ్యేరు-గొల్లపాలెం రహదారి పనులకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. మరో 6 నెలల్లో రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, కాజులూరు పిఎసిఎస్ అధ్యక్షులు యాళ్ళ వెంకటరమణ, మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు మేడిశెట్టి పెద్ద, కూటమి నాయకులు చోడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి జాతరలో ఆదివారం యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్యూలైన్లలో యాత్రికులు ఇబ్బందులు పడకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది వేగవంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. అలాగే క్యూ లైన్ లో యాత్రికులకు మంచినీటి సరఫరా చేశారు. అలాగే వృద్ధులు, చిన్నారులకు పాలు అందజేశారు. దేవస్థానం కాలక్షేప మండపంలో నిర్వహించిన బాలలు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అనంతరం నాట్యాచార్యులను ఎసి విజయలక్ష్మి పూలమాలలు, సాలువాలతో సత్కరించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు యాత్రికులకు ఫలహారాలను అందజేశారు. సిఐ విజయశంకర్, ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నాట్యాచారులను సన్మానిస్తున్న ఎసి విజయలక్ష్మి

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్

సజ్జన సమాజ్ ఇంటర్నే షనల్ ఆధ్వర్యంలో స్థానిక వివేకా నంద పార్క్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇసి మెంబర్ డాక్టర్ సుమయ్య రుషిక, విఠల్, మేనక, సఫియా, దేవి, పావని, హర్ష, రాఫియా, సుధీర్, సజ్జన్ గురుకుల్ బాలలు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికోద్యోగి ఎస్.శ్రీనగేష్ మాట్లాడారు. పోక్రాన్ అణు పరీక్షలలో కీలకమైన, సంస్థాగత, సాంకేతిక, రాజకీయ పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడలో కలాంకు నివాళులర్పిస్తున్న చిన్నారులు

8200 బంగారు కుటుంబాల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలో 8200 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఆదివారం మండలంలోని ఇర్రిపాకలో ఆరు కుటుంబాలను విద్యుత్ శాఖ ఇఇ ఉదయ్‌భాస్కర్ దత్తత తీసుకుని ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ సహాయ నగదును ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఎంఎల్ఎ నెహ్రూ సమక్షంలో ఇఇ కుమారుడు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జ్యోతుల మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పి.4 పేద కుటుంబాలను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. నియోజక వర్గంలో 8200 బంగారు కుటుంబాలు ఉన్నాయన్నారు. అయితే వారిని ఆదుకునేందుకు స్థానికంగా వనరులు లేక బయట వారిని భాగం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి సూర్యభాస్కర రావు, టిడిపి నాయకులు బస్వా చినబాబు పాల్గొన్నారు.

తవ్వేసారు..వదిలేశారు...

ప్రజాశక్తి - సామర్లకోట

డ్రెయినేజీ నీరు పారుదల అయ్యేందుకు రోడ్డును తవ్వి పైప్ లైన్ నిర్మించిన అధికారులు రోడ్డును పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో గొల్లపేటకి వెళ్లే రహదారి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఐదు నెలల క్రితం డ్రెయినేజీలో నీటిని మున్సిపల్ ఆఫీస్ వెనుక ఉన్న చెరువులోకి మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందుకోసం తవ్విన గోతులు పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఆ గోతుల్లో పడి పలువురు ప్రమాదాల భారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్కూల్ పిల్లలను తీసుకెళ్లే ఆటో ప్రమాదానికి గురికావడంతో పలువురు విద్యార్థులు గాయాల పాలయ్యారు. రాత్రి సమయాల్లో గోతులు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ వేసిన ప్రాంతంలో రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా ఉన్న రహదారి

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 6029 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law) & Authorized Officer, ...Plaintiff
And
Sri.D.Yohan ...Defendant
To
Sri.D.Yohan,S/o.Ammadu,Aged about 46 Years, Occ: Business, R/o. H.No.9-1-46, Lawyers Street Peddapuram, East Godavari Dist.,Andhra Pradesh-533437.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,87,056-43ps _to_wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.
In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 2118 of 2022

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.byits Sr.Manager(Law) & Authorized Officer, ...Plaintiff
And
Sri.Nageswara Rao.V ...Defendant
To
Sri.Nageswara Rao.V, S/o. Venkateswara Rao, Aged about 52 Years, Occ: Business, R/o. H.No.3-173, Indrapalem, Lakulast, Kakinada Rural, A.P-533006.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,36,251-21ps to_wards utilization of Credit card.The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.
In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 3167 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
Sri.K.Satyanarayana ...Defendant
To
Sri.K.Satyanarayana, S/o. Nookayya, Aged about 66 Years, Occ: Employee, R/o. D.No 48-21-1/4, Goleelapeta, Near Lions Club, Jagannaikpur, Kakinada, A.P-533002.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.5,85,833-10ps_to_wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 28-08-2025.
In case of your failure to attend before the Court on 28-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.